క్లుప్తంగా

సమగ్ర భూ రీసర్వేని పరిశీలించిన డీఐ



రీసర్వేని పరిశీలిస్తున్న డీఐ హేమలత, తహసీల్దార్ ఈశ్వరయ్య

లింగాల : మండలంలోని బోనాల గ్రామంలో చేపట్టిన సమగ్ర భూ రీసర్వే కార్యక్రమాన్ని డివిజనల్ ఇన్‌స్పెక్టర్ హేమలత బుధవారం పరిశీలించారు. సర్వే నెంబర్ రాళ్లను గుర్తించి శాటిలైట్ చిత్రాల ద్వారా కచ్చితమైన సర్వే నిర్వహించాలన్నారు. రైతుల మధ్య వివాదాలకు తావు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఈశ్వరయ్య, సర్వేయర్ పార్వతి, ఆర్‌ఐ రామగంగాధరరెడ్డి, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు, గ్రామ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

శనగ పంట పరిశీలన

సింహాద్రిపురం : మండలంలోని నంద్యాలంపల్లెలో బుధవారం శనగ పంటను జిల్లా అగ్రికల్చర్ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు పరిశీలించారు. అనంతరం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని రైతులకు పంటల సంరక్షణకు తీసుకోవాల్సిన పలు సూచనలు, సలహాలను అందించారు. రైతులు జౌకులతో పంటలు సాగు చేయడానికి వీల్లేకుండా పోతోందని, దీంతో తీవ్రంగా నష్టపోతున్నామని జేడీఏ దృష్టికి తీసుకొచ్చారు. దీనికి ఆయన స్పందిస్తూ అధికారులతో మాట్లాడి మీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఏఓ శివమోహన్‌రెడ్డి, రైతు సేవా కేంద్ర సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, పీఆర్పీ శ్రీనివాస్ ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలలో విద్యార్థుల ప్రతిభ



రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులతో హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు

సింహాద్రిపురం : గత ఏడాది నవంబర్ నెలలో సత్యసాయి జిల్లా హిందూపురంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో గురిజాల పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు పాఠశాల హెడ్మాస్టర్ విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. బుధవారం గురిజాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులను ఆయన అభినందించి మాట్లాడారు. రాష్ట్రస్థాయి అండర్–17 వాలీబాల్ పోటీలో శ్రీకాంత్, రాష్ట్రస్థాయి అండర్–14 బాలికల కబడ్డీ పోటీలో నిరూప, రాష్ట్రస్థాయి అండర్–17 బీచ్ వాలీబాల్ పోటీలో చరణ్‌కుమార్‌రెడ్డిలు ప్రతిభ చూపారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను డీఈఓ శంషుద్దీన్, ప్రొద్దుటూరు డివిజన్ డిప్యూటీ డీఈఓ మీనాక్షిలు అభినందించారన్నారు. కార్యక్రమంలో పీడీ విక్టర్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



జైల్‌లో సౌకర్యాల గురించి ఖైదీలను అడిగి తెలుసుకుంటున్న జడ్జి బాబా ఫక్రుద్దీన్

జమ్మలమడుగు రూరల్ : జైలు శిక్ష అనుభవిస్తూ న్యాయవాదులను ఏర్పాటు చేసుకోవడానికి డబ్బులు లేని వారు ఏవరైన ఉంటే అటువంటి వారికి ఉచితంగా న్యాయ సహాయంను అందిస్తున్నామని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ తెలిపారు. బుధవారం పట్టణంలోని సబ్‌జైల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. తప్పు చేసి జైల్ జీవితం అనుభవించిన వారు బయటకు వెళ్లిన తరువాత సత్ప్రవర్తనతో మెలగాలని ఆయన సూచించారు. అనంతరం ఖైదీల ఆరోగ్య స్థితిగతులను, సౌకర్యాలను, జైల్ పరిసరాలను, రికార్డులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో జైల్ సూపరింటెండెంట్ విష్ణువర్ధన్‌రెడ్డి, న్యాయవాదులు భూతమపురం సుబ్బారావు, పాలాజి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆలయ ధ్వజ ప్రతిష్టా మహోత్సవం

వల్లూరు : మండలంలోని గొల్లఓబాయపల్లెలో వెలసిన శ్రీ సీతాలక్ష్మణ హనుమత్సమేత కోదండ రామాలయంలో శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు ధ్వజ ప్రతిష్ట, కుంభాభిషేక మహోత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 31న ఉదయం గోపూజ, మహా గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవచనం, కళశ స్థాపన, వివిధ హోమాలు, ధ్వజ స్తంభ జలాది వాసము జరుగుతుంది. సాయంకాలం అంకురారోపన, మహా స్నపనము, ప్రధాన హోమాలు, శయ్యాది, రత్నాధివాసము జరుగుతుంది. ఫిబ్రవరి 1వ తేదీ తెల్లవారు జామున యంత్రములు, ధ్వజ స్తంభానికి 108 కళశాలతో అభిషేకం, యంత్ర ప్రతిష్ట, నూతన ధ్వజ ప్రతిష్టా కార్యక్రమాలు జరుగుతాయి. అనంతరం మహా పూర్ణాహుతి, మహా కుంభాభిషేకం జరుగుతుంది. ఉదయం 10 గంటల నుండి శ్రీ సీతా రాముల కళ్యాణ మహోత్సవం జరుగుతుంది. మధ్యాహ్నం 12 గంటలకు అన్న ప్రసాద వినిమయం జరుగుతంది. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

పంటలపై ఆవుల దాడి.. నష్టపోతున్న రైతులు



బి. కొట్టాలపల్లెలో అడవి ఆవుల దాడిలో దెబ్బతిన్న శనగపంట



రాత్రివేళ కాపలకాస్తున్న రైతులు

కొండాపురం : రైతులు శ్రమించి పండించిన పంటను రాత్రి వేళ అడవి ఆవులు గుంపులు గుంపులుగా వచ్చి పచ్చని పంట పొలాలను తొక్కుతుండటంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రబీ సీజన్‌లో మండలంలో అధికంగా శనగ పంట 8500 ఎకరాల్లో సాగు చేశారు. బి. కొట్టాలపల్లె, కోనవారిపల్లె, వెంకటాపురం, బురుజుపల్లె, కె.రామిరెడ్డిపల్లె గ్రామాల్లో సాగు చేసిన శనగపంట, ఉద్యానవన పంటపొలాల్లో బెడుదూరు కొండ మీద ఉన్న అడవి ఆవులు రాత్రి వేళ పంటలపై దాడిచేసి పూర్తిగా నాశనం చేస్తున్నాయి. బి.కొట్టాలపల్లెలోని సత్యమయ్య, ఆదిరెడ్డి రవీంద్రారెడ్డి, ప్రసాద్, రెడ్డయ్య, ఆర్.లక్ష్మీనారాయణరెడ్డి పొలాలను అడవి ఆవులు నాశనం చేశాయి. వాటిని అరికట్టేందుకు గ్రామాల రైతులు టీములుగా ఏర్పడి రాత్రివేళ కాపల కాస్తున్నారు. దీనిపై ఫారెస్ట్ రేంజ్ అధికారి అశోక్‌కుమార్‌కు రైతులు ఫిర్యాదు చేయగా అడవి ఆవులు మాకు సంబంధంలేదని వ్యవసాయ అధికారులు, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసికెళ్లాలని ఆయన రైతులకు సలహాఇచ్చారు. వ్యవసాయ అధికారితో మాట్లాడితే ఉన్నతాధికారులకు సమస్యను తెలియజేస్తామన్నారు.

రాత్రంతా మేల్కోవాల్సిందే



పంటపొలాల్లోకి అడవి ఆవులు రాకుండా కాపలా కాస్తున్నాం. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా పంట పొలాల్లోకి వస్తాయి. చీకటిలో టార్చిలైట్ వెలుగులతో శబ్దాలు చేస్తు రాత్రంతా మేల్కోవాల్సివస్తోంది. పగలు వ్యవసాయ పనులు చేసుకుంటు రాత్రి వేళ మేలుకోవడం వల్ల కునుకే లేకుండా పోతోంది. అడవి ఆవులు బెడద లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కంబం శంకర్‌రెడ్డి, కోనవారిపల్లె

పరిష్కారం చూపాలి



అడవి ఆవులకు బయపడి రైతులందరం కలసి ఓకేపంట వేసుకోవాల్సివస్తోంది. అకాల వర్షాలతో ఏ పంట వేసినా పెట్టుబడులు సక్రమంగా రాలేదు. మరో పక్క అడవి ఆవులు వచ్చి పంటలను తొక్కి నష్టం చేస్తున్నాయి. అడవి ఆవుల బెడద నుంచి పంట పొలాలను రక్షించేందుకు అధికారులు స్పందించి పరిష్కారం చూపాలి.

– చప్పిడి జగన్‌మోహన్‌రెడ్డి, కోనవారిపల్లె

నిధులను మంజూరు చేయించండి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, తదితరులు

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీలో అభివృద్ధిని కొనసాగించడానికి నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌ను మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, కౌన్సిలర్లు కిశోర్, ఖాదర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు రసూల్, సుంకర రవిలు కోరారు. బుధవారం పులివెందుల ఆర్డీఓ కార్యాలయానికి వచ్చిన కలెక్టర్ శ్రీధర్‌ను వారు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులివెందుల మున్సిపాలిటీలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అర్ధాంతరంగా ఆగిపోయిన, ప్రజలకు అత్యంత అవసరమైన యూజీడీ, ఎస్టీపీ, రాణితోపు రోడ్డు, స్మశాన వాటిక, వాటర్ గ్రిడ్ పనులకు నిధులు మంజూరు చేయాలన్నారు. అలాగే రేషన్ పంపిణీ వ్యవస్థ పులివెందులలో చాలా అధ్వానంగా తయారైందని, పేదలకు రేషన్ బియ్యం అందించకుండా డీలర్ల ఇంటి వద్ద కేవలం రెండు, మూడు రోజులు మాత్రమే పంచి పేదల కడుపు కొడుతున్నారని, వీటిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఆర్డీఓ చిన్నయ్యతో మాట్లాడుతూ రేషన్ పంపిణీ విషయం గురించి అడిగి తెలుసుకుని సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న ప్రధాన శాస్త్రవేత్త శివరామకృష్ణ

వేముల : గ్రామీణ ప్రాంత రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని అరటి పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త శివరామకృష్ణ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో బుధవారం ప్రకాశం జిల్లా చంద్రశేఖరపురం గ్రామానికి చెందిన కదిరి బాబూరావు కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు రోజులలో రైతు సోదరులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. విద్యార్థులు తయారు చేసిన నమూనాలను, అరటి పరిశోధనా స్థానంలో జరుగుతున్న పరిశోధనల గురించి రైతులకు వివరించారు.

అలాగే పులివెందుల ఉద్యాన కళాశాల ఆసోసియేట్ డీన్ నాగరాజు మాట్లాడుతూ చీనీ పంటలో బెలుకును ఎక్కువగా వాడకూడదని, నీటిని తగిన మోతాదులో ఇవ్వాలని, అనవసరమైన మందులను పిచికారి చేయవద్దని సూచించారు. నాబార్డు డీడీఎం విహారి మాట్లాడుతూ నా బార్డు ద్వారా రైతులకు అందిస్తున్న పథకాల గురించి రైతులకు వివరించారు. ఉద్యాన కళాశాల విద్యార్థులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన విషయాలను నమూనాల రూపంలో రైతులకు ప్రదర్శించారు. కార్యక్రమంలో పులివెందుల హెచ్‌ఓ రాఘవేంద్రారెడ్డి, శాస్త్రవేత్త రేష్మా, వీహెచ్‌ఏ హారిక, ఎర్రబల్లె, వేముల రైతులు పాల్గొన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల టౌన్ : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్ (ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణరాలు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సభ్యం, మాగురు, అలర్జీ, ఆనెలు, కాళ్ల పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు అందిస్తారన్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి ఎదగాలి

వేంపల్లె : విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యనభ్యసించి ఉన్నతస్థాయికి ఎదగాలని ఆర్‌జేడీ, ఉర్దూ కళాశాల ప్రిన్సిపాల్ రవి తెలిపారు. బుధవారం పట్టణంలోని స్థానిక ఉర్దూ కళాశాలలో నిర్వహించిన వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉన్నతమైన మనస్సుతో చాలా మంది కళాశాలకు సహకరిస్తున్న దాతలకు ధన్యవాదాలు అన్నారు. ఉర్దూ కళాశాలలో విద్యార్థుల కోసం ల్యాబ్ కోసం జిల్లా కలెక్టర్ రూ.15 లక్షల నిధులను మంజూరు చేశారని, ప్రభుత్వ కళాశాలల్లో సౌకర్యాలు కల్పించేందుకు దాతలు సహకరిస్తున్నారన్నారు. విద్యార్థులు కూడా కళాశాలకు మంచి పేరు వచ్చే విధంగా విద్యనభ్యసించి మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఇంటర్ విద్యార్థులకు కూడా ప్రభుత్వం మంచి మధ్యాహ్నం భోజనం పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ప్రతి సంవత్సరం శాశ్వతంగా కళాశాలలో టాపర్‌గా వస్తున్న విద్యార్థులకు రూ.3వేల నగదు బహుమతి ఇవ్వడం జరుగుతుందని రిటైర్డ్ టీచర్ నరసింహారెడ్డి హామీ ఇచ్చారు. చెడు అలవాట్లకు ప్రతి విద్యార్థి దూరంగా ఉండాలని, ప్రతి విద్యార్థి కష్టపడి, ఇష్టపడి చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. అనంతరం కళాశాలకు సీసీ కెమెరాలు ఇచ్చిన దాతలను కళాశాల తరపున ఘనంగా శాలువాలతో సత్కరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ మైనారిటీ ప్రధాన కార్యదర్శి నిస్సార్‌బాషాను ఆర్జేడీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ప్రిన్సిపాల్ హబీబుల్లా, కళాశాల కమిటీ చైర్మన్ అబ్దుల్ గఫార్‌బాషా, ఎంఈఓలు జాఫర్ సాదిక్, స్టాలిన్ ఐజాక్, వేముల, చక్రాయపేట కళాశాల ప్రిన్సిపాల్ రామసుబ్బయ్య, వైసీపీ ప్రధాన కార్యదర్శి నిస్సార్‌బాషా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు శ్రీ వాసవీ మాత ఆత్మార్పణ ఉత్సవం

వల్లూరు: స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి దేవస్థానంలో శుక్రవారం శ్రీ వాసవీ మాత ఆత్మార్పన ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 31న ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం జరుగుతుందన్నారు. అనంతరం కన్యలతో కలిసి కళశములతో పవిత్ర జలాన్ని తెచ్చి అమ్మవారికి అభిషేకము, లక్షార్చన, వాసవీ నామాలతో పూజలు జరుగుతాయి. ఉదయం 10 గంటలకు అమ్మవారికి హోమ గుండ ప్రవేశం అనంతరం గ్రామోత్సవం జరుగుతుంది. మధ్యాహ్నం సంతర్పణ జరుగుతుంది. రాత్రి మంగళ హారతి, ప్రసాద వినియోగము జరుగుతుందని తెలిపారు.

నోటిలో నురగ, గొంతు వాపుతో బర్రెలు మృతి



బర్రెలకు చికిత్స చేస్తున్న సచివాలయ పశువైద్య సహాయకురాలు చేతన

చక్రాయపేట : మండలంలోని మహదేవపల్లెలో గొంతు వాపు వ్యాధితో బర్రెలు మృతి చెందుతున్నట్లు జడ్పీటీసీ సభ్యుడు శివప్రసాదరెడ్డి తెలిపారు. బర్రెలకు నోటిలో నురగ రావడం, గొంతు వాపు వచ్చి చని పోతున్నాయని ఆయన తెలిపారు. మహదేవపల్లె దళితవాడకు చెందిన లక్షుమమ్మకు చెందిన బర్రె, గంగులయ్యకు చెందిన రెండు బర్రెలు చనిపోయాయని తెలిపారు. వీటి విలువ ఒక్కొక్కటి సుమారు రూ.50 వేలు పైనే ఉంటుందన్నారు. మహదేవపల్లెకు చెందిన నరసింహులు అనే రైతుకు సంబంధించిన ఒక బర్రె నోటిలో నురగతో నేల పడిందన్నారు. బుధవారం గ్రామ సచివాలయ పశువైద్య సహాయకురాలు చేతన పశువులకు వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. గంగారపువాండ్లపల్లె, బాట్లోపల్లెల్లో కూడా ఈవ్యాధి అధికంగా ఉందని తెలిపారు. నాగలగుట్టపల్లెలో పశువైద్యాధికారి లేకపోవడంతో చక్రాయపేట పశువైద్యాధికారి ఇన్‌చార్జిగా ఉంటున్నాడన్నారు. మండల వ్యాప్తంగా ఒక్కరే పశువులకు వైద్యం అందించాలంటే ఇబ్బంది పరిస్థితి ఎదురవుతోందని జడ్పీటీసీ ఆవేదన వ్యక్తం చేశారు. గొంతువాపు వ్యాధి తో పశువులు మృతి చెందుతున్న విషయంపై పశువైద్యాధికారి మధుసూదన్‌ను వివరణ కోరగా ఆయా గ్రామాల్లో వ్యాక్సిన్ వేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

కమలాపురం : మండలంలోని గంగవరం గ్రామ ఆర్చీ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కమలాపురం పట్టణానికి చెందిన అబ్దుల్లా తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, బాధితుని కుటుంబ సభ్యులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. అబ్దుల్లా కమలాపురం నుంచి గంగవరంకు నడిచి వెళ్తుండగా వెనుక వైపు నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీ కొట్టి వెళ్లి పోయాడు. అతడి కాలు విరగడంతో పాటు చేతికి బలమైన గాయం అయింది. కాగా 108 వాహనంలో కమలాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

పంట కోత ప్రయోగంలో మంచిదిగుబడి

ఎర్రగుంట్ల : మండలంలోని తుమ్మలపల్లెలో బుధవారం శనగపంటలో పంటకోత ప్రయోగం చేయగా ఎకరాకు ఐదు క్వింటాళ్లు దిగబడి వచ్చిందని మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. సాగు చేసిన శనగ పంటలో 5 గీ5 వెడుల్పుతో 25 చదరపు అడుగుల వైశాల్యం తీసుకుని పంట కోతను ప్రయోగం చేశామన్నారు. మూడు కిలోలు రాగ సరాసరీ ఎకరాకు సుమారు ఐదు క్వింటాళ్లు దిగుబడి నమోదు అయిందన్నారు. మంగళవారం వై.కోడూరులో పంటకొత ప్రయోగం చేశామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, ఇన్సురెన్స్ అధికారులు రైతులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ మీనాక్షి

తొండూరు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ప్రొద్దుటూరు డిప్యూటీ డీఈఓ మీనాక్షి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె పదవ తరగతి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేసే ప్రణాళికను ప్రధానోపాధ్యాయుడు కె.వి.సుబ్బారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించి విలువైన సూచనలిచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఈఓ హెడ్మాస్టర్‌తో మీ పాఠశాల చాలా బావుందని, మంచి ఫలితాలు సాధిస్తున్నారని ప్రశంసించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

వీరపునాయునిపల్లె : స్థానిక మండల పరిషత్ సభా భవనంలో గురువారం ఉదయం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి చంద్రమౌళీశ్వర్ తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే చైతన్యకుమార్ రెడ్డి రానున్నట్లు ఆయన తెలిపారు. ఆయా శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించి నివేదికతో హాజరుకావాలన్నారు. సమావేశానికి ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, కో ఆప్షన్ మెంబర్లు హాజరుకావాలని ఆయన కోరారు.

మట్కా బీటర్లు అరెస్ట్



పట్టుబడ్డ మట్కా బీటర్లతో కమలాపురం సీఐ ఎస్‌కే రోషన్, వల్లూరు ఏఎస్‌ఐ ప్రసాద్

వల్లూరు : మండల పరిధిలోని గణేష్‌పురం సమీపంలో మూతపడ్డ పాత పెట్రోల్ బంకు వద్ద బుధవారం ముగ్గురు మట్కా బీటర్లను అరెస్ట్ చేసినట్లు కమలాపురం సీఐ ఎస్‌కే రోషన్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఏఎస్‌ఐ ప్రసాద్, తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి మూతబడ్డ పాత పెట్రోల్ బంకు సమీపంలో మట్కా రాస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ 50,420 ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కమలాపురం పోలీస్ సర్కిల్ పరిధిలో గ్యాంబ్లింగ్, మట్కా, క్రికెట్ బెట్టింగ్, గంజాయి, ఇసుక అక్రమ రవాణా, మద్యం అక్రమ రవాణా వంటి అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలు డయల్ 112కు గానీ, సీఐ కమలాపురం సెల్ నంబరు 9121100529కు గానీ, వల్లూరు ఏఎస్‌ఐ సెల్ నంబరు 9966164741కు తెలియజేసి వాటిని అరికట్టుటకు సహకరించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేరు గోప్యంగా వుంచడమే కాక వారికి పోలీసు శాఖ తరుపున తగిన పారితోషికము ఉంటుందన్నారు.

చిరుద్యోగులను భయపెట్టకండి



ఐసీడీఎస్ సీడీపీఓ సునీతకు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు

వేంపల్లె : గత ప్రభుత్వంలో నియమితులయ్యారన్న సాకుతో అంగన్‌వాడీ చిరుద్యోగులను భయభ్రాంతులకు గురి చేయడం తగదని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎస్.మంజుల, జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కె సి.బాదుల్లా తెలిపారు. బుధవారం వేంపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ సునీతకు అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు భవానమ్మతో కలిసి వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ నాయకుల మాటలు విని నోటీసులతో భయపెట్టే విధానాలకు స్వస్తి పలకాలన్నారు. చిరుద్యోగులైనా అంగన్‌వాడీ కార్యకర్తలపైన స్థానిక అధికార పార్టీ నాయకులు మాటలు విని ఉపాధి అవకాశాలను తొలగించాలనే విధానాలు సరైనది కాదన్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారం ఉంటే వారి అనుకూలంగా ఉన్న వారిని నియమించుకోవాలనే ఆలోచనను మానుకోవాలన్నారు. ఐసీడీఎస్ వేంపల్లె ప్రాజెక్టు పరిధిలోని చక్రాయపేట మండలం చిలేకాంపల్లె పంచాయతీ నారపురెడ్డిగారిపల్లెలో పనిచేస్తున్న అంగన్‌వాడీ కేంద్రంలోని సహాయకురాలును ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్నారని తొలగించాలనుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. చిరుద్యోగులను బెదరించడం, బలవంతాన అధికారులతో నోటీసులు ఇచ్చి తొలగిస్తామనే విధానాలకు స్వస్తి పలకకపోతే జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాల్సి వస్తుందని విజ్ఞప్తి చేశారు.

పరిహారం చెల్లించకుంటే పనులను అడ్డుకుంటాం



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

ముద్దనూరు : ఇంటిస్థలాలు కోల్పోతున్న బాధితులకు పరిహారం చెల్లించకుండా పనులు చేపడితే జాతీయ రహదారి పనులను అడ్డుకుంటామని భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులు హెచ్చరించారు. బుధవారం మండలంలోని కమ్మవారిపల్లెను సీపీఎం నియోజకవర్గ కార్యదర్శి ఎంవీ సుబ్బారెడ్డి ఇతర నాయకులు సందర్శించి బాధితులతో మాట్లాడారు. రెండు రోజుల నుంచి 4 లేన్ల రహదారికి ఇళ్లు, ఇంటి స్థలాలు కోల్పోయిన బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. పరిహారం చెల్లించకుండా రోడ్డు పనులు చేస్తున్నారన్నారు. జిల్లాలో ఇప్పటికే చాలాప్రాంతాల్లో పరిహారం చెల్లించకుండా రహదారి పనులు పూర్తిచేశారని వారికి ఇప్పటివరకు పరిహారం అందలేదని, పరిహారం చెల్లించకుండా కమ్మవారిపల్లెలో పనులు చేస్తే అడ్డుకుంటామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

వెంటనే ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

జమ్మలమడుగు : సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం వెంటనే ఎస్సీవర్గీకరణ చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మానికింద వెంకటేష్ మాదిగ, ఎంఈఎస్ నాయకుడు రాజు మాదిగలు కోరారు. బుధవారం ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చిన్నయ్య అధ్వర్యంలో లక్ష డప్పులు–వేల గొంతుకల కార్యక్రమంలో భాగంగా ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమానికి సంఘీభావంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎస్సీవర్గీకరణ పోరాట ఫలితంగా సుప్రీం కోర్టు ఎస్సీవర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది.కార్యక్రమంలో మాదిగ దండోర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



కొండాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



స్కూటరిస్టులకు హెల్మెట్లను అందజేస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

జమ్మలమడుగు రూరల్ : వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని జమ్మలమడుగు డీఎస్పీ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం పట్టణంలో వాహనదారులకు భద్రత నియమాలపై సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ తప్పనిసరిగా వాహనానికి సంబంధించిన రికార్డులు ఉండాలన్నారు. బైక్‌లలో ప్రయాణించేవారు హెల్మెట్లు ధరించాలన్నారు. అనంతరం స్టేషన్‌లో రోడ్డు భద్రతపై ఆటో డ్రైవర్లకు సూచనలు అందజేశారు. కొంత మందికి దాతలు ఇచ్చిన 30 హెల్మెట్లను ఆయన ప్రధానం చేశారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందితో కలసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ ఎస్.లింగప్ప, ఎస్‌ఐ బి.రామకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

కొండాపురంలో..

కొండాపురం : రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరు పాటిస్తూ సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని కొండాపురం సీఐ మహమ్మద్‌రఫీ తెలిపారు. బుధవారం రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా కొండాపురంలో వాహనచోదకులకు అవగాహన కల్పించి ద్విచక్ర వాహనదారులు, పోలీసులు హెల్మెట్ ధరించి బైకు ర్యాలీ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్, కారులో ప్రయాణించే టప్పుడు సీట్ బెల్ట్ తప్పకుండా ధరించాలన్నారు. దేశంలో ప్రతి నిమిషానికి ఒక రోడ్డు ప్రమాదం జరుగుతుండగా ప్రతి మూడు నిమిషాలకు ఒకరు రోడ్డు ప్రమాదంలో ఒకరు మృత్యువాత పడుతున్నారన్నారు. ఎక్కువ శాతం అధిక వేగంతో రోడ్డుపై వాహనాలను నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం జరుగుతోందన్నారు. తాళ్లప్రొద్దుటూరు ఎస్‌ఐ హృషికేశ్వర్ రెడ్డి, ఎస్‌ఐ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : భద్రతా నియమాలు పాటించి సురక్షితంగా వుండాలని సీఐ దస్తగిరి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలు నడిపే వారికి ట్రాఫిక్, హెల్మెట్ దరించడంపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ రహదారి భద్రతపై అవగాహన పెంచుకోవాలన్నారు.